
# కల్లకాని నిజం

★



రచన : శ్రీ. దివాకర్ల సన్యాసిరాజు.

దిక్కులన్నీ పగిలి ముక్కలయ్యేలా గర్జిస్తోంది ఆకాశం. కనుపాపలు బ్రద్దలయ్యేలా జిగేల్ మని మెరుస్తోంది. ఆ మెరుపు వెలుగు, నీడల్లో జీభూతాల్లా ఊగుతున్నాయి చుట్టూ ఉన్న చెట్లు. ఎంతబలమైనా పెకలించుకుపోయేలా వీస్తోంది రొజ్జగాలి.

అరుణ వాయుదేవు లిద్దరూ హఠాత్తుగా దండెత్తారు భూదేవిమీద. కుండనతో దిమ్మరించినట్లు కురుస్తోంది వర్షం. నా పాతికేళ్ళ జీవితంలోనూ చవిచూళ్ళేదిలాంటి రాత్రి. వికృతంగా అరుస్తున్నాయి ఎవో జంతువులు గాలివానకి జడిసి.

రామాపురం రైలు స్టేషనుకి అయిదు మైళ్ళ దూరంలో ఉంది సీతానగరం. చుట్టూ దట్టంగా పెరిగిన అడవులున్నాయి.

ఈ సీతానగరానికి బ్లాకు డవలప్ మెంటు ఆఫీసరుగా వేశారు నన్ను.

ప్రభాత సమయంలో ఈ వూర్లో అడుగు పెట్టిన నాకు ఈ వాతావరణం ఎంతో అహ్లాద కరముగా ఉంది.

ఊరికి కొంతదూరంలో ఏకాంతంగా ఉంది ఒక డాబాయిల్లు. పట్నంనుండీ ఏ గవర్నమెంటు ఉద్యోగి వచ్చినా ఆ యింట్లోనే బస, తక్కిన సౌకర్యాలు కరణంగారి యింటినుండి అమరుతాయి. ఆ యింటిని కనిపెట్టుకొని ఒక ముసలాడు - ఆ వూరివాడే ఉన్నాడు.

పగలెంత అందంగా ఉందో రాత్రంత భీభత్సంగా ఉంది. బెక్కు బెక్కు మంటున్న యింట్లో కూర్చున్న నాకు నేరకపోయి వచ్చానా భగవంతుడా! అనిపించింది.

'బాబూ! కిటికీ రెక్కలు ఏసెయ్యమంటారేటి?' అన్నాడు గదిలో మూలగా గోనె పరుచుకొని కూర్చున్న తాత.

గదిలో ఉన్న హరికేన్ లాంతరు విపరీతంగా గెంతుతోంది. 'వేసేయి తాతా చలేస్తోందికూడ!' అన్నాను.

లేచి కిటికీలు గదితలుపులు గడియపెట్టి తిరిగి కూర్చున్నాడు తాత.

ఇంటిమీద ఎవరో రాళ్ళు రువ్వినట్లుగా పడుతోంది వర్షం నాకు నిద్రపట్టలేదు.

'తాతా! ఈ యిల్లెవరిది? వూరికింతదూరంగా ఎందుకు కట్టారు?' అన్నాను నిశ్శబ్దం భరించలేక.

'ఎవురిదైతేనేం బాబూ!' అన్నాడు తాత అదోరకంగా.

'ఏంతాతా! చెప్పకూడదా!' అన్నాను కుతూహలంగా.

'మీకు దెయ్యాలూ భూతాలు అంటే భయమేస్తుందా!' అడిగాడు తాత.

'ఛ...వాటిమీద నమ్మకంలేదు. భయం అంతకన్నా లేదు. వాటినెప్పుడూ చూళ్ళేదు' అన్నాను. ఎందుకలా అడిగాడో అర్థంకాక.

'అయితే సెప్తాను యినండి బాబూ!' ఈ యింటో దెయ్యం ఉంది! అని ఆగాడు.

'ఆ!!!' అన్నాను ఆశ్చర్యంగా.

'ఈ యిల్లు ఉన్నసోట పెద్ద సింతసెట్టు ఉండేది. దాన్ని మాఊర్లో అందరూ దెయ్యాలసింతసెట్టు అనేవారు. అర్థరేతిరి ఆ సెట్టు మీదనుండీ నిప్పులురాలేవి. ఒక్కొక్కప్పుడు తెల్లని సీర కట్టుకున్న అందమైన పిల్ల పాటలు పాడేది. పాడుతూ పాడుతూ గబుక్కునా వేసి గట్టిగా ఏడిసేది.

మాతాత సిన్నప్పుడు, ఈ వూర్లో ఎవురో జమిందారు ఉండేవాడంట. ఆయనకాడ మా


ఖాతాదారులకు, శ్రేయోభిలాషులకు మా హృదయపూర్వకమైన దీపావళి అభినందనలు!!




"స్టాండర్డ్" పటాసులు

పూ మత్తాబులు

"నెమిలి" మార్కు & "భీగం" మార్కు కంబిమత్తాబులు.
"నెమిలి" & స్వస్తిక్ మార్కు కేప్ బిళ్ళలు.
"రెడ్ పోర్ట్" మార్కు & "తాజ్" మార్కు పటాసులు
"నెమిలి" మార్కు కలర్ మత్తాబులు, మరియు అనేక
నూతన పటాసు దినుసులు.

*

అత్యుత్తమమైన పద్ధతిలో, అపాయములేని విధముగా
తయారై భారత దేశమంతటనూ ప్రసిద్ధి పొందియున్న

"స్టాండర్డ్"

తయారింపులనే కోరి, కొని ఉపయోగించండి.

తయారించువారు :

దిస్టాండర్డ్ ఫయిర్ వర్క్సు ఇండస్ట్రీస్

టెలిఫోన్ : 57 - శివకాశి - తపాలు పెట్టె నెం. 32

తాత, నౌకరీ సెసేవాడు. అయన పెల్లాని నానాయింసలు ఎట్టేవాడంట, ఆ బాదలు పడలేక ఆ మా తల్లి సచ్చిపోనాది ఒక అర్ధరాతిరి, ఈ సింత సెట్టుకి ఉరేసుకోని. అయమ్మ దెయ్యమై ఆ సెట్టుమీదే ఉండేదంట,

మాటు మడిగితే ఆ సెట్టుకాడికి ఎల్డానికి జడసేవోరు ఈ వూరిపెజలు.

పదిసంవచ్చరాలకితం ఒక బెంగాలీబాబు వచ్చాడు ఈఊరికి. ఆ సింతసెట్టు నరికించేసి ఈ యిల్లుకట్టించాడు. ఆయనకి పెంల్లాం, యిద్దరు పిల్లలు ఉన్నారు. కొన్నాళ్ళు బాగానే ఉన్నారు. కానీ హఠాత్తుగా యిసిత్రాలు జరగడం మొదలెట్టాయి. తెల్లారేసరికి వంటగదిలోని సామానంతా అ బెంగాలీ బాబు పడుకున్న గదిలో పేర్చిఉండేవి.

మరోనాడు ఆబాబు గదిలో పడుకుంటే తెల్లారేసరికి పెరట్లో పడుకోనిఉండేవాడు.

రాత్రి మంచంమీద పడుకుంటే ఉదయం మంచంకింద ఉండేవోడు.

ఊరంతా దీనికి దెయ్యాల కొంప అని పిలిచేవోరు.

యిక్కడ పనిసెయ్యడానికి జడిసి ఎవరూ వప్పుకోనేవారు కాదు. అయితే ఈ వూరులోనే ఉన్న రంగడనేవోడు మాత్రం యిక్కడ పని చేసేవాడు. ఆడికిలాంటి బయాలులేవు. ఆడికి ఎక్కువ డబ్బుయిచ్చేవోడు ఆ బెంగాలీబాబు.

యిక్కడపని మానెయ్యమని ఆడి పెల్లాం పోరుపెట్టేది. కానీ ఆడు వగ్గలేదు. అయితే అడు పనిసేసినకాడ్నించీ మరో యిసిత్రం జరిగేది. అదురాతిరి యిక్కడపడుకుంటే, తెల్లారి ఆడియింటికాడ ఉండేవోడు.

ఆ డింటికాడ పడుకుంటే యిక్కడుండేవాడు.

ఆడొక మొండి గటం. భయభీతులు ఆడికే కొసాన్నా లేవు.

ఒకనాడు బెంగాలీబాబుతో పట్నం ఎల్లాడు. రామాపురానికి ఏభైమైళ్ళదూరంలో ఉంది పట్నం.

రామాపురంలో రాత్రి రైలెక్కారు. తెల్లారేసరికి రంగడు యింటికాడ పడుకోని ఉన్నాడు.

ఈ బాధలతో విసుగెత్తిపోయి కలకత్తా ఎల్లిపోయాడు ఆ బెంగాలీబాబు.

ఎవరికైనా కావాలంటే ఈ యిల్లు అమ్మేయమన్నాడు.

రంగడ్ని మాత్రం వదల్లేదు ఆ దెయ్యం.

రాత్రి పడుకున్నసోట ఉదయం ఉండేవోడుకాడు.

యిలా జరిగేసరికి ఆడి పెల్లానికి అనుమానమేసి రంగడ్ని ఎంత కట్టుదిట్టం సేసినా లాభం లేకపోయింది. ఎప్పుడూ యిద్దరూ వొమ్ములాడుకొనేవోరు.

ఒక నాడు రంగడు ఆడి పెల్లాం అడు బయట పడుకోని నిద్రపోతున్నారు.

రంగడ్ని ఎవరో లేపేసరికి మెలుకువొచ్చింది.

మెత్తని పరుపుమీద పడుకోని ఉన్నాడు.

అది రామాపురం జమీందారు భవనం.

పైం అంతస్తుల్లో జమీందారు అతని భార్య పడుకొని ఉంటే అళ్ళిద్దరి మద్దినా పడుకోనీ ఉన్నాడు రంగడు.

రంగన్నిసూసి అగ్గెయి పోయాడు జమీందారు.

సేతికొచ్చినట్లు బాదేసాడు.

రంగడు ఏడుస్తూ 'బాబూ! యిది నాతప్పు కాదు. తెలిసి సెయ్యలేదుబాబూ! యిది నా కర్మ. అయిదుసంవత్సరాలై నన్నొక దెయ్యంపట్టుకుంది. రాతిరి పడుకున్నసోట తెల్లారి ఉండనివ్వదు. తెల్లారివేసి ఉసూరుమంటూ యింటికి పోతాను. ఈ రాతిరి యిక్కడకి తెచ్చి పడేసింది! అని మొరపెట్టుకున్నాడు.

ఆ జమీందారుకి యింతగానే కనపడింది వ్యవహారం.

'అయితే నీ యిల్లెక్కడ? నీ పేరేమిటి?' అన్నాడు.

'నాపేరు రంగడు బాబూ! సీతానగరం'

'నిన్ని రాత్రి ఆ గదిలో పెట్టి తలుపులు మూసేస్తాను, తెల్లారేసరికి గదిలో ఉన్నావా నీమాటలు అబద్ధం!' అని చిన్నగదిలోపెట్టి తలుపులు మూసి చుట్టూ కాపలా పెట్టారు.

రాత్రి రెండుగంటలైందప్పుడు, రంగడు ఏడుస్తూ ఆగదిలో ఒకమూల పడుకొన్నాడు.

తెల్లారింది. జమిందారు తలుపులుతీసి చూసేసరికి రంగడు లేడు.

వెంటనే నలుగురు మనషులతో సీతానగరంవచ్చి చూసేసరికి రంగడు అరుగుమీద ఉన్న నులకమంచంమీద పడుకుని నిద్రపోతున్నాడు.

రంగడ్ని లేపారు జమిందారు.

జమిందార్నిసూసి ఆశ్చర్య పోయాడు రంగడు.

తన్నయితే దెయ్యం యిక్కడికి తెచ్చి పడేసింది మరి జమీందారెలావచ్చారు! అర్థం కాలేదు.

ఆశ్చరంగా చూస్తున్న రంగడిచేతులో పదిరూపాయలుపెట్టి నవ్వుతూ వెళ్ళిపోయారు జమిందారు.

అప్పటికాడ్నించీ యిప్పటివరకు 'రంగడు రాత్రి పడుకున్నసోట తెల్లారి ఉండడు.' అని చెప్పి ఆగిపోయాడు తాత.

నోరు తెరుచుకుని వింటూ ఉండిపోయాను ఆశ్చర్యంగా.

ఈ యింట్లోనే యిలాంటి విచిత్రాలు జరిగేయంటే గుండెలు వేగంగా కొట్టుకోవడం మొదలెట్టాయి. అంతరాళాల్లో ఏమూలో చిన్నభయం తలెత్తింది.

పైన వర్షం ఎడతెరిపిలేకుండా కురుస్తోంది. నిద్ర ముంచుకొస్తోంది.

'తాతా! యిప్పుడు ఆ రంగడెక్కడున్నాడు?' అడిగాను.

'ఈ వూల్లోనే ఉన్నాడు బాబూ!' అన్నాడుతాత.

'రేపు తీసుకొస్తావా'

'ఏం బాబూ! నేను సెప్పింది నమ్మలేకపోతున్నాగా!'

'కాదుతాతా! చూడాలని ఉంది, ఎలాగుంటాడో!' అన్నాను.

'తెల్లారి సూద్దురుగాని లెండిబాబూ! శానారాతిరైపోనాది, పడుకోండి' అన్నాడు తాత అవులిస్తూ.

బయటకెళ్ళి వచ్చి తలుపులు గడియపెట్టి పడుకున్నాను.

రంగడిగురించి ఆలోచిస్తూ పడుకున్న నాకు ఎప్పుడు నిద్ర పట్టిందో...

ఉదయంలేచి చూసేసరికి గదిలో తాత లేడు. రాత్రి గడియపెట్టిన తలుపులు అలాగే ఉన్నాయి.